www.prajapaksham.in
# ప్రజాపక్షం
ప్రతి అక్షరం ప్రజల కోసం
స్తంభాద్రి భద్రాద్రి
సోమవారం | 23 | మార్చి | 2026 పేజీలు : 7



## భగత్‌సింగ్ ఓసారి రావయ్యా..

మొన్న జుట్టుకు పన్నువేస్తే తిరుగుబాటు చేశారు జనం.
ఉప్పుపై పన్ను వేస్తే ఊరు ఊరు ''దండి''లా కదిలింది.
పన్ను వేసినోడు తెల్లోడు కాబట్టి వాడ్ని వెల్లిపోమన్నారు.
మరి నేటి నల్లోడి సంగతేంటి ?
తెలియకుండానే పన్నేసి గుంజుతుండు.
జిఎస్‌టి పేర ప్రజలనెత్తురు జుర్రుతుండు..
మతంపేర, కులంపేర విభజించి ఎల్లకాలం
తానే ఏలచూస్తుండు.
ప్రశ్నిస్తే జైలు, కాదంటే దేశద్రోహి.
ఇంత జరుగుతున్నా.. నోరు మెదపరేం.
పోరాట జవ చచ్చిపోయిందా.
తలవంచి బతకటం అలవాటు అయిందా..
ఓ భగత్‌సింగ్ మళ్లీ ఓ సారి రావయ్యా
నిశ్చలమైన ఈ సమాజాన్ని చలింపజేయగా
కొలువు వేతనం, సరదాలు తప్ప
ప్రజలకోసం కొట్లాడలేని యువతరాన్ని మేల్కొల్పగా
ఆలోచన, అధ్యయనం ఆయుదాలుగా
సమరానికి యువతరాన్ని సన్నద్ధం చేయగ.
ఓ భగత్‌సింగ్ ఓసారి రావయ్యా..

భగత్‌సింగ్ 95వ వర్ధంతి సందర్భంగా నివాళ్లర్పిస్తూ..
- ఏనుగు వెంకటేశ్వరావు, ప్రజాపక్షం, ఖమ్మం.


ప్రజలకు భరోసా కల్పించేలా
# బడ్జెట్ రూపకల్పన



-ప్రతి కుటుంబానికి ఐదు లక్షల బీమా
-విద్య, వైద్య, గృహ నిర్మాణానికి ప్రాధాన్యత
-మీడియా సమావేశంలో
ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క

ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ : తెలంగాణ రాష్ట్రంలో జీవించే ప్రజలకు భరోసా కల్పించేలా బడ్జెట్ రూపకల్పన చేసినట్లు రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, ఆర్థిక శాఖ మంత్రి మల్లు భట్టివిక్రమార్క తెలిపారు. పుట్టిన బిడ్డ నుంచి చివరి వ్యక్తి వరకు ఏదో ఒక పథకాన్ని అమలు చేస్తున్నామని ఆయన తెలిపారు. ఆదివారం కాంగ్రెస్ కార్యాలయం సంజీవరెడ్డి భవన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క మాట్లాడుతూ తాను ప్రజాప్రతినిధిగా గ్రామాల్లో పర్యటించినప్పుడు, పాదయాత్ర చేసిన సమయంలో, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి బహిరంగ సభలో ప్రజల నుంచి వచ్చిన సమస్యలను గుర్తించి వాటికి పెద్దపీట వేసినట్లు తెలిపారు. ముఖ్యంగా విద్య, వైద్య, గృహ నిర్మాణానికి ప్రాధాన్యత కల్పించినట్లు తెలిపారు. రాష్ట్రంలో నివసించే 1.15 కోట్ల కుటుంబాలకు ఐదు లక్షల బీమా సౌకర్యాన్ని కల్పిస్తూ పథకాన్ని రూపొందించామన్నారు. కుటుంబ పెద్ద మరణిస్తే సామాజికంగా, ఆర్థికంగా ఆ కుటుంబాన్ని ఆదుకునేలా ఈ పథకాన్ని అమలు చేస్తున్నామన్నారు. తెలంగాణ రాష్ట్రంలో విద్యను అభ్యసించే విద్యార్థులకు అంతర్జాతీయ స్థాయి ప్రమాణాలతో విద్యను అందించడంతో పాటు వారి ఆరోగ్య పరిరక్షణకు ప్రాధాన్యతనిస్తున్నామన్నారు. గురుకులాలు, యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్స్‌తో పాటు ప్రతి నియోజక వర్గంలో తెలంగాణ మోడల్ పబ్లిక్ స్కూళ్లను ఏర్పాటు మిగతా 2లో..

## ఖద్దరు గుప్పెట్లో.. ఖమ్మం కార్పోరేషన్...!





-అనేక విషయాల్లో వేలుపెడుతున్న చోటా నేతలు
-జీ హుజూర్ అంటున్న ఉద్యోగులు
-అభివృద్ధి పనుల్లో పెరిగిన జోక్యం
-టెండర్లు ఒకరివి.. చేసేది మరొకరు
-లోపిస్తున్న నాణ్యత.. నోరెత్తని అధికారులు

ప్రజాపక్షం/ఖమ్మం టౌన్ : ఖమ్మం కార్పోరేషన్‌లో ఇటీవల కాలంలో అనధికారుల జోక్యం ఎక్కువైపోయింది. ఒక్క మాటలో చెప్పాలంటే ప్రస్తుతం కార్పోరేషన్ అవినీతి గుప్పెట్లో చిక్కుకుని విలవిల్లాడుతోంది. కంటికి కనిపించని పెత్తనాలు రాజ్యమేలుతున్నాయి. ప్రజాప్రతినిధుల అనుచరులమంటూ కొందరు అనేక విషయాల్లో లక్ష్మణరేఖను దాటేస్తున్న మిగతా 2లో..

## ఉలిక్కిపడ్డ మట్టి మాఫియా..!

- అక్రమ తవ్వకాలపై కలెక్టర్ సైతం ఆరా?
- లారీ పత్రాల ఫోర్జ్‌పై ఆర్టీ ఏజెంట్లతో సంప్రదింపులు
- తీవ్ర చర్చనీయాంశమైన ప్రజాపక్షం కథనం

2


నయా మట్టి దందా..

కొత్త ఎత్తుగడలతో అక్రమ తవ్వకాలు, డంపింగ్‌లు
ఆర్టీఏ పత్రాలు ముగిసిన రోడ్లపైనే లారీలు
కస్నాతండాలో తవ్వకం వరంగల్‌హైవే పక్కన డంపింగ్
చేష్టలుడిగి చూస్తున్న అధికార యంత్రాంగం

అక్రమ డంపింగ్‌లు...

మామూళ్ల మత్తులో మైనింగ్ శాఖ...

# ప్రజలకు భరోసా కల్పించేలా బడ్జెట్ రూపకల్పన

(మొదటిపేజీ తరువాయి)

చేస్తున్నామన్నారు. విద్యార్థులకు మధ్యాహ్న భోజనంతో పాటు అల్పాహా రంగా మూడు రోజులు పాలు, మూడు రోజులు రాగి జావ అందించను న్నట్లు తెలిపారు. యుక్త వయస్సులో ఉన్న ఇంటర్మీడియట్ విద్యార్థులు కూడా పౌష్టికాహారం అందించాలని ఈ ఏడాది నుంచి మధ్యాహ్న భోజన పథకాన్ని అమలు చేస్తున్నామన్నారు. వైద్య రంగానికి ప్రాధాన్య తనిస్తూ మల్టీ స్పెషాలిటీ ఆసుపత్రుల్లో బెడ్స్ సామర్థ్యాన్ని 30వేల నుంచి 44వేలకు పెంచేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. రాష్ట్రంలో ఇండ్లు లేని పేదలు ఉండకూడదనే లక్ష్యంతో ఇందిరమ్మ ఇంటి పథకం ద్వారా 4.5 లక్షల ఇండ్లను మంజూరు చేశామని వాటికి నిధులు కూడా కేటాయించామని ఇండ్ల నిర్మాణం చేపట్టిన వారికి వారం వారం నిధులు కూడా జమ చేస్తున్నామన్నారు. ఈ ఏడాది ప్రతి నియోజక వర్గానికి వెయ్యి ఇండ్లు మంజూరు చేయనున్నామన్నారు. ఉద్యోగులకు వారి కుటుంబాలకు కూడా క్యాష్‌లెస్ వైద్యాన్ని అందజే యనున్నట్లు తెలిపారు. రైతాంగానికి అన్ని రకాల అండగా ఉండేందుకు రైతుభరోసాతో పాటు సన్న ధాన్యానికి రూ. 500 బోనస్ కల్పిస్తున్నామ న్నారు. ఎకరం లోపు ఉన్న రైతులకు ఆరువేల చొప్పున రైతు భరోసా నిధులు మంజూరు చేశామని 45 రోజుల్లో పూర్తి స్థాయిలో రైతు భరోసా విడుదల చేస్తామని తెలిపారు. నీటిపారుదల రంగానికి ప్రాధాన్యత కల్పిస్తూ ప్రాజెక్టుల నిర్మాణానికి నిధులు మంజూరు చేసినట్లు తెలిపారు. ఉన్నత విశ్వ విద్యాలయాల అభివృద్ధికి నిధులు మంజూరు చేశామని తెలిపారు. గోదావరి పరివాహక ప్రాంతంలో జీవించే గిరిజనులకు సంబంధించి ఇందిర సౌర జల గిరి వికాస పథకం క్రింద బోర్లు, మోటార్లు, విద్యుత్ సౌకర్యం ఉచితంగా అందించనున్నట్లు తెలిపారు. వ్యవసాయ రంగానికి ఉచిత విద్యుత్‌ను అందిస్తున్నట్లు తెలిపారు. మహి ళలకు ఆర్టీసిలో ఉచిత ప్రయాణం, 200 యూనిట్ల వరకు గృహ విద్యుత్ ఉచితంగా అందిస్తున్నామన్నారు. గోదావరి పుష్కరాలను విజ యవంతంగా నిర్వహించేందుకు నిధులు మంజూరు చేసినట్లు తెలి పారు. ప్రజల జీవన ప్రమాణాలను మెరుగుపర్చడమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం పని చేస్తుందని ఆయన తెలిపారు. ఈ సమావేశంలో కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు నూతి సత్యనారాయణ గౌడ్, మాజీ ఎంఎల్‌ఏ కొండబాల కోటేశ్వరరావు, మాజీ జిల్లా అధ్యక్షులు పువ్వాళ్ల దుర్గాప్ర సాద్, మహ్మద్ జావిద్, దొబ్బల సౌజన్య, పుచ్చకాయల వీరభద్రం, బాలగంగాధర్ తిలక్, పలువురు నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# ఖద్దరు గుప్పెట్లో.. ఖమ్మం కార్పోరేషన్..!

(మొదటిపేజీ తరువాయి)



సందర్భాలు కూడా ఉన్నాయి. అభివృద్ధి పనులకు ప్రాధాన్యత ఇస్తున్నా టెండర్లు అర్హత కలిగిన కాంట్రాక్టర్ల చేత వేయించి తర్వాత ఆ పనులను ముక్కలు ముక్క లుగా విడగొట్టి క్షేత్రస్థాయిలో అధికార పార్టీ కార్యకర్తలకు కట్టబెడుతున్నారన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. దీంతో పనుల్లో నాణ్యత లోపాలు ఉంటున్నా యన్న ఆరోపణలు ఉన్నాయి. మొక్కలు నాటడం, ఎండ్ టూ ఎండ్ రోడ్లు వేయడం రోడ్ల ప్యాచ్ వర్క్ ఇలాటివన్నీ లోతుగా పరిశీలిస్తే అందులోని లోపాలు, పాపాలు బయటపడే అవకా శాలు ఉన్నాయి. అయితే క్వాలిటీ కంట్రోల్, విజిలెన్స్ లాంటి నిఘావిభా గాలు నిద్రపోతూ పెద్ద తలల నియోజక వర్గాలంటు భావించి క్షేత్రస్థాయి పరిశీలన జోలికి వెళ్లడంలేదు. ఎండ్ టు ఎండ్ రోడ్ల విషయానికి వస్తే రోడ్ల చివర బాగా ఉన్న రోడ్లను కూడా కొంతమేర యంత్రాలతో కట్ చేసి ఆ సీసీ శిధిలాలను తొలగించి తిరిగి అక్కడ ఎండ్ టు ఎండ్ రోడ్లు వేస్తున్నారు. ఈ అభివృద్ధి పనుల అంచా నాలు కూడా అధికంగా ఉంటున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. గత ప్రభు త్వాల్లో మున్సిపల్ కాంట్రాక్టర్లు అంటు ప్రయివేటు విభాగం ఉండేది. వారే అభివృద్ధి పనుల టెండర్లు దక్కించుకుంటు క్షేత్రస్థాయిలో ఆ పనులను చేసి సీనియారిటీ క్రమంలో బిల్లులు తీసుకునేవారు. ఇటీవల కాలంలో నేతలే బడాకాంట్రాక్టర్ల మాట్లాడి వారి పేరుపైన టెండర్లు వేయించి ఆ టెండర్లు పొంది వచ్చిన పనులను తమ అనుచ గణాలకు పంచిపెడుతున్నారు. దీంతో గతంలో ఉన్న ప్రయివేటు కాంట్రాక్టు వ్యవస్థ రోజురోజుకు వెనుకబడిపోయింది. ఒకవేళ కాంట్రాక్టర్లు ముందుకొచ్చి పనులు చేయాలని భావించి టెండర్లు వేసినా క్షేత్రస్థా యిలో పనులు చేయడం సాధ్యం కావడంలేదు. అడుగడుగునా ఆటం కాలు ఎదురవుతున్నాయి. పనులు పూర్తయినా బిల్లులు రావడం చాలా కష్టతరంగా మారింది. అందుకే కార్పోరేషన్‌లో అనేక అభివృద్ధి పనులకు మేయర్‌లచేత ర్యాటిఫికేషన్ ఆర్డర్లు వేయించి విచ్చలవిడిగా జనరల్ ఫండ్స్ నిధులను కేటా యింపచేసుకుంటున్నారు. తెరవెనుక నేతలు సిఫారసుచేసిన వారికే బిల్లులు, లేని వారికి చిల్లులు అన్నచందంగా ఈ అభివృద్ధి వ్యవస్థ మారిపోయింది. ఒ వైపు అవినీతి అక్రమాలు జరి గితే చూస్తు ఊరుకోం అంటు ప్రకటనలు గుప్పి స్తున్న ఆ ప్రకటనలకు క్షేత్రస్థాయిలో జరిగే వ్యవ హారాలకు అసలు సంబంధం ఉండడం లేదు. ఇక సిటీ ప్లానింగ్ విషయానికొస్తే ఈ వ్యవస్థపై ఒత్తిళ్లు రోజురోజుకు ఎక్కువవుతున్నట్లు ఆరోప ణలు ఉన్నాయి. సిటీప్లానింగ్ కొందరు నేతలు తమ జేబుసంస్థగా మార్చుకున్నట్లు కూడా ఆరోప ణలు ఉన్నాయి. దీంతో సిటీ ప్లానింగ్ అధికారుల పనితీరు ముందు నుయ్యి, వెనుక గొయి అన్న చందంగా మారింది. ప్రజల ఓట్లతో గెలిచిన ప్రజాప్రతినిధులు కార్పోరేటర్లు క్షేత్రస్థాయిలో పెత్తనాలకు రాకపోయినా సంబంధిత కార్పోరేటర్ల బంధువుల పెత్త నాలు క్షేత్రస్థాయిలో ఎక్కువై పోయాయన్న విమర్శలు వెల్లువెత్తుతు న్నాయి. ముఖ్యంగా మంత్రి ప్రాతినిధ్యం వహించే ఖమ్మం నియోజకవ ర్గంలోనే ఇలాంటి సంఘటనలు జరుగుతున్నాయి. ఇక ఏళ్ల తరబడి స్థానచలనాలు లేకుండానే ఆయా విభాగాలలో పేరుకుపోయిన కొందరు ఉద్యోగులు తమకున్న రాజకీయ నేతల అండదండలతో ఆయా సీట్లలో పెత్తనాలు చలాయిస్తున్నట్లు కూడా ఆరోపణలు ఉన్నాయి. ఇలా ప్రతి విభాగాన్ని పరిశీలించి చూస్తే ఖమ్మం కార్పోరేషన్‌లో ప్రతి విభాగంలో తెరవెనుక రాజకీయ జోక్యం రోజురోజుకు పెరిగిపోతుంది. దీనిని అరిక ట్టాల్సిన ఉన్నతస్థాయి ప్రజాప్రతినిధులు ఇంతవరకు ఆ దిశగా ఆలో చించి సరైన కఠిన నిర్ణయాలు తీసుకోవడంలేదన్న భావన నగర ప్రజల్లో వ్యక్తమవుతోంది.

# దార్శనిక దేవాలయాలుగా ఇంటిగ్రేటెడ్ స్కూళ్లు

-లక్ష్మీపురం స్కూల్ పనుల్లో వేగం పెంచండి





ప్రజాపక్షం/ బోనకల్ : విద్యకు ఇందిరమ్మ ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యతనిస్తుందని దార్శనిక దేవాలయాలుగా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూళ్ల నిర్మాణం చేపట్టామని రాష్ట్ర ఉప ముఖ్య మంత్రి, ఆర్థిక శాఖ మంత్రి మల్లు భట్టివిక్రమార్క తెలిపారు. విద్య కోసం పెట్టే ప్రతి రూపాయి భవిష్యత్తు తరాలను నిర్మించడం కోసం పెట్టే పెట్టుబడిగా అభివర్ణించారు. ఆదివారం మధిర నియోజక వర్గంలో పర్యటించిన ఉప ముఖ్యమంత్రి భట్టివిక్రమార్క బోనకల్ మండలం లక్ష్మీ పురం గ్రామంలో నిర్మాణంలో ఉన్న ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూళ్ల పనుల పురోగతిని పరిశీ లించారు. నిర్మాణ ప్రాంతాలను పరిశీలించారు. హాస్టల్, అడ్మినిస్ట్రేటివ్ భవన నిర్మాణాలను పరి శీలించారు. మెకానికల్, సైన్స్, గణితం, కంప్యూటర్ ల్యాబ్ భవన నిర్మాణాలను పరిశీలించి అధి కారులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా భట్టి మాట్లాడుతూ నిర్మాణ పనుల్లో మరింత వేగం పెంచాలని అధికారులకు సూచించారు. నాణ్యతలో ఎక్కడ రాజీ పడవద్దని ఇవి కేవలం భవనాలు కాదని రేపటి తరాలను ఉజ్వలంగా నిర్మించే దార్శనిక దేవాలయాలన్నారు. ఈ కార్య క్రమంలో ప్రజాప్రతినిధులు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా నవగ్రహ హోమం





ప్రజాపక్షం/ ఎర్రుపాలెం : తెలంగాణ తిరుపతిగా ప్రసిద్ధిగాంచిన స్వయంభూ జమలాపురం శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయంలో నవగ్రహ హోమాన్ని ఘనంగా నిర్వహించారు. వసంత నవ రాత్రి బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం ప్రధాన అర్చకులు శ్రీనివాసశర్మ ఆధ్వర్యంలో నవ గ్రహ హోమాన్ని ఘనంగా నిర్వహించారు. స్వామి వారికి సుప్రభాత సేవ, ప్రాతఃకాల అర్చనలు, అష్టోత్తర నామములు, మండపారాధనతో పాటు నవగ్రహ హోమం నిర్వహించారు. గోశాల వద్ద గోపూజ నిర్వహించారు. స్వామి వారిని దర్శించుకున్న భక్తులకు అన్నప్రసాద వితరణ చేశారు. సాయంత్రం హంస వాహనంపై అలివేలుమంగ, పద్మావతి సమేతుడైన స్వామి వారికి గిరిప్రద ర్శన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఈవో కొత్తూరు జగన్‌మోహన్‌రావు, వ్యవస్థా పక ధర్మకర్త ఉప్పల విజయదేవశర్మ, ఉప్పల మురళీమోహన్ శర్మ, మార్తి వెంకటరమణ, అర్చ కులు రాజీవ్ శర్మ, రఘురామకృష్ణమూర్తి, చక్రధర్, రామదాసి, విజయ్ కృష్ణ, వెంపటి సాయి అభిలాష్ శర్మ, దండ సోమయ్య, సిబ్బంది, గ్రామస్తులు, భక్తులు పాల్గొన్నారు.

# మనస్తాపంతో వ్యక్తి మృతి

ప్రజాపక్షం/ ఎర్రుపాలెం : మండల పరిధిలోని బనిగండ్లపాడు గ్రామానికి చెందిన యన్నం వెంకట్రామిరెడ్డి (70) అనే వ్యక్తి మనస్తాపంతో కట్టలేరు బ్రిడ్జికి ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్న ఘటన ఆదివారం చోటు చేసుకుంది. ఎస్ఐ రమేష్ కుమార్ తెలిపిన వివరాల ప్రకారం... బని గండ్లపాడుకు చెందిన వెంకట్రామిరెడ్డి తనకున్న మూడు కుంటల భూమిని అదే గ్రామానికి చెందిన వ్యక్తులకు విక్రయించాడు. కొనుగోలు చేసిన వ్యక్తులు వెంకట్రామిరెడ్డికి కొంత నగదును ఇచ్చి మిగిలిన నగదు ఇవ్వకుండా అట్టి స్థలం గ్రామ పంచాయతీదని ఎవరు అమ్ముకూడదు, కొన కూడదని బెదిరించారని సూసైడ్ నోట్‌లో పేర్కొన్నట్లు తెలిపారు. భూమి విషయంలో మన స్తాపం చెంది ఆత్మహత్యకు పాల్పడినట్లు మృతుని భార్య అదెమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు ఎస్ఐ రమేష్ కుమార్ తెలిపారు.

# ఉలిక్కిపడ్డ మట్టి మాఫియా..!

ప్రజాపక్షం/ఖమ్మంరూరల్ : ఖమ్మంరూరల్ మండలంలో కొత్తరూపం దాల్చిన మట్టి దందాపై నయా మట్టి దందా శీర్షికన ప్రజాపక్షం పత్రిక స్థాయిలో ప్రచు రించిన కథనం మట్టి మాఫియాను ఉలిక్కిపడేలా చేసింది. కథనం వెలువడిన వెంటనే అక్రమ తవ్వకాలలో నిమగ్నమైన వ్యాపారులు అప్రమత్తతో కార్యకలాపా లను ఒక్కసారిగా నిలిపివేయడం విశేషం. ఎక్కడి దొంగలు అక్కడే గప్‌చుప్ అన్న ట్లు, మట్టి రవాణాకు ఉపయోగిస్తున్న లారీలను తమ డెన్నులతో పాటు కొన్ని పెట్రోల్‌బంక్‌ల వద్ద దాచిపెట్టినట్లు సమాచారం. ఇదే సమయంలో లారీలకు అవసరమైన అనుమతి పత్రాలు సక్రమంగా ఉండేలా చేసుకునేందుకు ఆర్టీఏ ఏజెంట్లను సంప్రదిస్తూ పత్రాలను సిద్ధం చేసుకునే ప్రయత్నాలు మొదలుపెట్టా రు. ఈ అక్రమ వ్యవహారంపై జిల్లా కలెక్టర్ ఆగ్రహం వ్యక్తం చేసినట్లు అధికార వర్గాల ద్వారా సమాచారం తెలిసింది. ఈ నేపథ్యంలో సంబంధిత శాఖలు కఠిన చర్యలకు ఉపక్రమించబోతున్నట్లు తెలుస్తోంది. అవసరమైతే పోలీస్‌శాఖ సహా యం తీసుకొని రాత్రిపూట జరుగుతున్న మట్టి తోలకాలపై ఉక్కుపాదం మోపేం దుకు అధికారులు సిద్ధమైనట్లు సమాచారం. అయితే ప్రజాపక్షం కథనం మట్టి మాఫియాకు మాత్రం కొరకని కొయ్యగా మారిందనే అభిప్రాయం వ్యక్తమవు తోంది. ఇప్పటి వరకు భయం లేకుండా సాగిన అక్రమ తవ్వకాలు ఒ క్కసా రిగావెలుగులోకి రావడంతో మాఫియాలో ఆందోళన నెలకొన్నట్లు తెలుస్తోంది.

## అక్రమ తవ్వకాలపై కలెక్టర్ ఆరా?

అక్రమ మట్టి తవ్వకాలు యథేచ్ఛగా కొనసాగుతున్నాయన్న ప్రజాపక్షం కథనం పై కలెక్టర్ ఆరా? తీసినట్లు సమాచారం. అనుమతులు లేకుండా మట్టి తవ్వ కాలు, రవాణా చేపడుతున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని సంబంధిత శాఖలకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేసినట్లు తెలిసింది. అక్రమ తవ్వకాలపై సంబంధిత శాఖల అధికారులను ప్రశ్నించినట్లు అధికార వర్గాల ద్వారా తెలి సింది. రాత్రిపూట మట్టి తోలకాలు అధికంగా జరుగుతున్నందున వాటిపై ఉక్కు పాదం మోపాలని, అవసరమైతే పోలీస్‌శాఖ సహకారం తీసుకోవాలని అధికారు లకు సూచించనట్లు సమాచారం. తవ్వకాల వల్ల ప్రభుత్వానికి ఆదాయం నష్టం కలగడమే కాకుండా పర్యావరణానికి కూడా హాని కలుగుతోందని కలెక్టర్ అసం తృప్తి వ్యక్తం చేసినట్లు తెలిసింది. వీటిని సమర్థవంతంగా నియంత్రించడంలో విఫ లమవుతున్న శాఖలను మందలించినట్లు సమాచారం. మట్టిని రవాణా చేస్తున్న వాహనాలను వెంటనే సీజ్ చేయాలని, బాధ్యులపై కేసులు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించినట్లు తెలిసింది. ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసి అక్రమ తవ్వకాలపై నిరంతరం తనిఖీలు చేపట్టాలని కూడా సూచించినట్లు సమాచారం.

## అప్రమత్తమైన మట్టి మఫియా...

ఇన్నిరోజులుగా ఎటువంటి భయం, సరైన పత్రాలు లేకుండానే అడ్డగోలుగా అక్రమ మట్టి తవ్వకాలు కొనసాగిస్తున్న మట్టి మాఫియా అప్రమత్తమైంది. ఇందుకు ప్రజాపక్షం కథనం ప్రచురితమైన తర్వాత పరిస్థితుల్లో మార్పు కనిపి స్తోంది. ఒక వైపు కలెక్టర్ ఆదేశాలు, మరోవైపు ఆర్టీఏ అధికారులు నిఘా పెంచ బోతుండగా పరిస్థితి మారినట్లుంది. ప్రధానంగా మట్టి రవాణా చేసే లారీల పత్రాలు సక్రమంగా ఉండేలా ఆర్టీఏ ఏజెంట్లను సంప్రదిస్తూ తమ వాహనాలను సరిచేసుకునే ప్రయత్నాలు చేస్తున్నారు. అక్రమ రవాణాపై ఎప్పుడైనా తనిఖీలు జరిగే అవకాశముందని భావించి ముందస్తు జాగ్రత్తలు తీసుకుంటున్నట్లు సమా చారం. ఇదిలా ఉండగా మరో ఘటన వెలుగులోకి వచ్చింది. మట్టి మాఫియా దోపిడిని ఆసరగా చేసుకొని కొన్ని గ్రామాల్లో కొందరు వ్యక్తులు అక్రమ వసూ ళ్లకు పాల్పడుతున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. మాకు కొంత మొత్తం ఇస్తే సరే లేకపోతే అధికారులకు సమాచారం ఇస్తాం అంటూ బెదిరిస్తూ స్వప్రయోజ నాలు సాధించుకుంటున్నట్లు గ్రామస్తులు చెబుతున్నారు. ఇలాగే ఓ గ్రామంలో తొలుత అక్రమ తవ్వకాలను అడ్డుకున్నట్లు చేసిన కొందరు వ్యక్తులు, తర్వాత అదే మాఫియాతో సరుద్దకుపోయిన ఘటన కూడా వెలుగులోకి వచ్చింది. ఈ పరిణామాలు నిఘా వర్గాల దాకా వెళ్లగా స్థానికంగా చర్చనీయాంశంగా మారాయి.

# అగ్ని ప్రమాదంలో నష్టపోయిన మిర్చి రైతులకు న్యాయం చేస్తాం

**డిప్యూటి సిఎం భట్టి విక్రమార్క**






**ప్రజాపక్షం/మధిర :** అగ్నిప్రమాదంలో నష్టపోయిన రైతులకు న్యాయం చేస్తామని భీమా ప్రకారం సొమ్ము వచ్చేవిధంగా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు డిప్యూటి సిఎం మల్లు భట్టి విక్రమార్క ఆదేశాలు జారీ చేశారు. ఆదివారం మధిర నియోజకవర్గంలో సుడిగాలిలా పర్యటించారు. అందులో భాగంగా ఆత్కూరు లోని అగ్ని ప్రమాదానికి గురైన శ్రీ సాయి బాలాజీ కోల్డ్ స్టోరేజీని పరిశీలించారు. మంటలను అదుపులోకి తీసుకొచ్చేందుకు అధికారులు చేపడుతున్న చర్యలను పరిశీలించారు. అగ్నిప్రమాదానికి కారణాలు అధికారులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం కోల్డ్ స్టోరేజీలో నష్టపోయిన మిర్చి రైతులతో భట్టివిక్రమార్క మాట్లాడుతు శీతల గిడ్డంగిలో రికార్డు ప్రకారం ఉన్న మిర్చి సంబంధిత రైతులకు నిబంధలన ప్రకారం నష్టపరిహారం భీమాద్వారా అదించాలని అధికారులను ఆదేశించారు. మధిర మార్కెట్‌లో కూడా మిర్చి అమ్మకాలు, కొనుగోలు ఖమ్మం మాదిరిగా జరిగేలా చర్యలు తీసుకోవాలని ఆయన సూచించారు. అగ్ని ప్రమాదం జరిగిన ప్రాంతంలో మళ్లీ మంటలు చెలరేగకుండా ఉండేందుకు అవసరమైన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఈకార్యక్రమంలో జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి, ఖమ్మం పోలీస్ కమీషనర్ సునీల్‌దత్, మాజీ ఎమ్మెల్యే కొండ బాల కోటేశ్వరరావు, జిల్లా కాంగ్రేస్‌పార్టీ అధ్యక్షుడు నూతి సత్యనారాయణ, మాజీ డీసీసీ అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్, ఖమ్మం మాజీ నగర కాంగ్రేస్ అధ్యక్షుడు మహమ్మద్‌జావేద్,అధికారులు పాల్గొన్నారు.

# సేంద్రియ సాగుతో అధిక దిగుబడులు

**జిల్లా వ్యవసాయాధికారి పుల్లయ్య**




**ప్రజాపక్షం/చింతకాని :** సేంద్రియ సాగుతో తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడులు సాధించవచ్చని జిల్లా వ్యవసాయాధికారి ధనసరి పుల్లయ్య రైతులకు సూచించారు. ఆదివారం చింతకాని మండలం నాగులవంచ రైతు వేదిక నందు ఐటీసీ ఎంఎస్‌కే మరియు ఆదర్శ స్వచ్చంద సంస్థ ఆధ్వర్యంలో రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా జేడీఏ పుల్లయ్య మాట్లాడుతూ రైతులు తప్పనిసరిగా భూసార పరిక్షలు చేయించుకోవాలన్నారు. రైతు భరోసా కింద ఖమ్మం జిల్లాలో ఒక ఎకరం ఉన్న రైతులందరికీ సోమవారం బ్యాంకు ఖాతాతో రైతు భరోసా నిధులను ప్రభుత్వం జమ చేస్తుందన్నారు. జిల్లాలో యూరియా, కాంప్లెక్స్ ఎరువులు సమృద్ధిగా అందుబాటులో ఉన్నాయన్నారు. మధిర డివిజన్ ఏడీఏ స్వర్ణ విజయ్‌కుమార్ మాట్లాడుతూ రైతులు నేరుగా విత్తుకునే వరి సాగు గురించి రైతులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో మత్కేపల్లి మార్కెట్ కమిటీ చైర్మన్ అంబటి వెంకటేశ్వర్లు, ఆత్మాకమిటి డైరక్టర్ కొప్పుల గోవిందరావు, ఉధ్యానవనాధికారి విష్ణు, ఏవో సోములపల్లి మానస, ఏఈవో కళ్యాణి , ఆదర్శ సంస్థ డైరక్టర్ రామకృష్ణ, రైతులు పాల్గొన్నారు.

# యువతను ప్రోత్సహించాలి

- కౌన్సిలర్ మామిండ్ల శ్రీనాథ్‌రెడ్డి
- భగత్‌సింగ్ వర్ధంతి సందర్భంగా క్రీడా కిట్లు పంపిణీ



**ప్రజాపక్షం/ఖమ్మంరూరల్ :** క్రీడాలలో యువతకు తగిన ప్రోత్సాహం, అవకాశాలు కల్పిస్తే క్రీడా పరంగా దేశానికి వన్నె తేవడంలో కీలకపాత్ర పోషిస్తారని 32వ వార్డు సిపిఐ కౌన్సిలర్ మామిండ్ల శ్రీనాథ్‌రెడ్డి అన్నారు. ఆదివారం భగత్‌సింగ్ వర్ధంతిని పురస్కరించుకొని, తన వార్డులోని యువతకు వాలీబాల్, క్రికెట్‌కిట్ కిట్‌తో పాటు క్యారం బోర్డును అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...యువతలో అంచలంచలమైన ప్రతిభ దాగి ఉంటుందని, దానికి సరైన నైపుణ్యాభివృద్ధి, శిక్షణలు ప్రభుత్వం కల్పించడం ద్వారా వెలికితీయవచ్చునన్నారు. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకునేలా యువతకు ప్రోత్సాహం కల్పిస్తే మంచి ఫలితాలు అందుతాయి అన్నారు. దీంతో క్రీడలు, విద్యా, సాంకేతిక రంగాల్లో యువత ఆత్మవిశ్వాసం పెరిగి సమాజ అభివృద్ధికి తోడ్పడతారని అన్నారు. మున్సిపాలిటీతో పాటు గ్రామీణ ప్రాంతాల్లోని యువతకు శిక్షణ కేంద్రాలు ఏర్పాటు చేసి వారి నైపుణ్యాలు పెంపొందించాల్సిన అవసరం ఉందని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏఐవైఎఫ్ సభ్యులు, యువత పాల్గొన్నారు.

# వాసవి మాత పారాయణానికి బయల్దేరిన మహిళలు

**జెండా ఊపి బస్సులు ప్రారంభించిన మున్సిపల్ చైర్‌పర్సన్ కాపా చంద్రకళ**





**ప్రజాపక్షం/వైరా:** తెలంగాణ రాష్ట్ర ఆర్యవైశ్య కార్పొరేషన్ చైర్‌పర్సన్ కల్వ సుజాత గుప్త ఆధ్వర్యంలో హైదరాబాద్‌లో ఆదివారం చేపట్టిన వాసవి మాత సామూహిక పారాయణం కార్యక్రమంలో భాగంగా ఆర్య వైశ్య కార్పొరేషన్ జిల్లా ఇంచార్జి గ్రంధి ప్రవీణ్ ఆధ్వర్యంలో మహిళలు బస్సుల్లో పెద్ద ఎత్తున బయల్దేరి వెళ్లారు. వైరా మున్సిపాలిటీ వద్ద వాసవి మాత పారాయణంకు వెళుతున్న మహిళలకు మున్సిపల్ చైర్‌పర్సన్ డాక్టర్ కాపా చంద్రకళ, డిసిసిబి అధ్యక్షులు నూతి సత్యనారాయణ, ఖమ్మం జిల్లా కాంగ్రేస్ మెడికల్ అండ్ హెల్త్ చైర్మన్ డాక్టర్ కాపా మురళీకృష్ణ, వైరా మున్సిపాలిటీ మాజీ వైస్ చైర్మన్ ముళ్ళపాటి సీతారాములు వారికి స్వాగతం పలికారు. అనంతరం బస్సులను మున్సిపల్ చైర్‌పర్సన్ డాక్టర్ కాపా చంద్రకళ మురళీకృష్ణ జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా డాక్టర్ కాపా చంద్రకళ మాట్లాడుతూ ఆర్యవైశ్యులు కులదేవంగా భావించే వాసవి మాత పారాయణం ఎల్‌బి స్టేడియంలో ఏర్పాటు చేయడం ఎంతో అభినందనీయమని అన్నారు. ఈ కార్యక్రమంలో రంగా జనార్ధన్, మిట్టపల్లి నాగి, కొదుమూరు కోటేశ్వరరావు, మిట్టపల్లి శ్రీనివాసరావు, రాయల కృష్ణారావు, వేముల రత్నాకర్, మిట్టపల్లి రాఘవరావు, వేల్పుల మురళి, అనుమోలు భాస్కర్‌రావు, తాటికొండ రాము, పెద్ద ఎత్తున మహిళలు పాల్గొన్నారు.

# ఇటికాల భాస్కర్‌కు స్వర్ణ నంది పురస్కారం



**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** ప్రముఖ వాస్తు, ఇంజనీరింగ్ టౌన్ ప్లానింగ్ నిపుణులు ఇటికాల భాస్కర్‌కు స్వర్ణ నంది ఉగాది పురస్కారం అందజేశారు. ఖమ్మం నగరంలోని రామగిరి ఫంక్షన్ హాల్‌లో ఎన్నెస్పి క్వార్టర్స్ రామాలయంలో జరిగిన కార్యక్రమంలో మొగిలి, ఎన్ఎస్ ఎంటర్‌టైన్‌మెంట్స్ ఆధ్వర్యంలో ఇటికాల భాస్కర్‌కు స్వర్ణ నంది ఉగాది పురస్కారం అందజేశారు. తెలుగు, ఇంగ్లీష్, కన్నడ మూడు భాషల్లో ఇంటి ప్లాన్స్, వాస్తు, ఐటిఐ విద్యార్థుల కోసం ఇంజనీరింగ్ విషయాలతో కూడిన 13 పుస్తకాలు రచించి మూడు లక్షలకు పైగా ప్రతులు ప్రజలకు అందుబాటులో ఉండేవిధంగా ఇటికాల భాస్కర్ కృషి చేశారు. లక్షకు పైగా గృహాలకు ప్లాన్స్, వాస్తు, ఇంజనీరింగ్ సహకారం అందించారు. మధ్యతరగతి గృహాస్తులకు ఇటికాల భాస్కర్ అందించిన సేవలకు గాను స్వర్ణ నంది ఉగాది పురస్కారం అందించినట్లు నిర్వాహకులు తెలిపారు. ప్రస్తుతం ఇటికాల భాస్కర్ వైరా, కల్లూరు, మణుగూరు మున్సిపాలిటీలలో, సుడా టౌన్ ప్లానింగ్ విభాగంలో టిపిఎస్‌గా పనిచేస్తున్నారు. ఈ కార్యక్రమంలో నిర్వాహకులు మొగిలి, చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షులు కురువెళ్ల ప్రవీణ్ కుమార్,హార్వెస్ట్‌పాఠశాల డైరెక్టర్ పార్వతిరెడ్డి పాల్గొన్నారు.

# లెనిన్ శ్రీనివాస్‌కు స్వర్ణ నంది పురస్కారం



**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** ప్రముఖ కవి లెనిన్ శ్రీనివాస్‌కు స్వర్ణ నంది ఉగాది పురస్కారం అందజేశారు. ఆదివారం ఖమ్మంలోని రామగిరి ఫంక్షన్ హాల్ నందు మొగిలి, నాగసాయి ఎంటర్‌టైన్‌మెంట్ సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉగాది స్వర్ణ నంది అవార్డుల ప్రధానోత్సవంలో వికాస వేదిక సాహిత్య సంస్థ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, ప్రజాకవి లెనిన్ శ్రీనివాస్ సాహిత్య రంగంలో చేస్తున్న విశిష్ట సేవలకు గుర్తింపుగా స్వర్ణ నంది ఉగాది పురస్కారం అందజేశారు. ఈ సందర్భంగా మొగిలి గుణకర్, నాగసాయి లు మాట్లాడుతూ సాహిత్యం ఖమ్మం కేంద్రంగా అనేక మంది వర్ధమాన కవులను ప్రోత్సహిస్తూ మంచి పుస్తకాలను ప్రచురిస్తూ ఉభయ తెలుగు రాష్ట్రాల్లో ఎన్నో సత్కారాలు, పురస్కారాలు, ప్రశంసలు పొందిన లెనిన్ శ్రీనివాస్‌ను సత్కరించి అవార్డు ప్రధానం చేయడం ఆనందంగా ఉందన్నారు. ఈ సందర్భంగా లెనిన్ శ్రీనివాస్‌ను మంత్రిప్రగాడ శ్రీనివాసరావు, నామవరపు కాంతేశ్వరరావు, కర్తనందం, కర్నాటి శంకర్‌రావు, ప్రసాదరావు, తులసీదాస్ లు సత్కరించారు.

# విద్యారంగానికి ప్రభుత్వం మొండిచేయి




**ప్రజాపక్షం/ఖమ్మంరూరల్ :** బడ్జెట్‌లో విద్యారంగానికి కేవలం 8.22శాతం నిధులు కేటాయించి, ప్రభుత్వ విద్యారంగానికి మొండి చెయ్యి చూపించిందని ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర సమితి సభ్యుడు బురా మనోజ్ ఆదివారం ఓ ప్రకటలో విమర్శించాడు. ఇది ఖచ్చితంగా విద్యార్థి వ్యతేరేక విధానానికి నిదర్శనమేనని అవేదన వ్యక్తం చేశాడు. ఎన్నికల మేనిఫెస్టోలో 15శాతం నిధులు కేటాయిస్తామని హామీ ఇచ్చి, ప్రభుత్వం ఏర్పాటు తర్వాత అరకొర నిధులతో సరిపెట్టిందని రోపించాడు. రాష్ట్ర వ్యాప్తంగా పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్, ఫీజు, రీయింబర్స్‌మెంట్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశాడు. విద్యారంగానికి కనీసం 30శాతం అధిక నిధులు కేటాయించకపోతే ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళనలు చేపడతామని హెచ్చరించాడు.

# ట్యాంక్ బండ్‌పై వీధిలైట్లకు మరమ్మతులు



**ప్రజాపక్షం/మధిర :** గత మూడురోజుల నుండి ట్యాంక్ బండపై వీధిలైట్లు వెలగక అంధకారంగా ఉండటంతో మున్సిపల్ చైర్‌పర్సన్ సామినేని సుజాత, పదవ వార్డు కౌన్సిలర్ బోడేపూడి రేవతి ట్యాంక్ బండను సందర్శించి వీధిలైట్లు వెలగక పోవడంతో మరమ్మత్తులు చేయించారు. ఈసందర్భంగా మున్సిపల్ చైర్ పర్సన్ సామినేని సుజాత మాట్లాడుతు ట్యాంక్‌బండపై ప్రస్తుతం ఉన్న కేబుల్ కెపాసిటి సరిపోక బర్న అవుతున్నాయని ఇప్పుడు తాత్కాలిక మరమ్మత్తులు చేయించి వీధిలైట్లు వెలిగే విధంగా చర్యలు తీసుకుంటున్నామన్నారు. దీనికి శాశ్వతంగా ఇబ్బందులు లేకుండా కొత్త కేబుల్ వైర్ తో త్వరలో ట్యాంక్‌బండపై వీధిలైట్లకు ఆటంకం లేకుండా మరమ్మత్తులు చేయిస్తామన్నారు. అనంతరం వారు ట్యాంక్‌బండపై ఉన్న టాయిలెట్స్‌ను పరిశీలించారు. టాయిలెట్స్ సరిగా లేకపోవడంతో వాటిని కూడా బాగు చేయించారు. మున్సిపాలిటీలో ప్రజలకు ఏ ఇబ్బందులు వచ్చినా వెంటనే పరిష్కరిస్తామని తెలిపారు.

# ప్రభుత్వ స్థలం ఆక్రమణపై విచారణకు ఆదేశం



**ప్రజాపక్షం/వైరా:** వైరా మున్సిపాలిటీలో వ్యవసాయ కార్యాలయం సమీపంలో అక్రమంగా 60 గజాల ప్రభుత్వ స్థలాన్ని ఆక్రమించి ఆ స్థలాన్ని ప్రభుత్వ అధికారులు అండతో ఎటువంటి ఇళ్లు లేకపోయినా ఇంటి నెంబర్ సృష్టించిన మున్సిపల్ కార్మికుడు తమ సొంత స్థలంగా రిజిస్ట్రేషన్ విషయమై మున్సిపల్ చైర్‌పర్సన్ డాక్టర్ కాపా చంద్రకళ మురళీకృష్ణ స్పందించి స్థలం ఆక్రమణ ఇంటి నెంబర్ కేటాయింపుపై విచారణకు ఆదేశించారు. మున్సిపల్ కమీషనర్‌కు ఆదివారం ఆమె ఒక లేఖను పంపించారు. ఈ సందర్భంగా డాక్టర్ చంద్రకళ భూ ఆక్రమణపై పూర్తిస్థాయిలో విచారణ జరిపి వివరాలు అందించాలని కోరారు. అదేవిధంగా ప్రభుత్వ భూములను ఆక్రమించుకుంటే సహించేది లేదని చట్టపరంగా చర్యలు తప్పవని ఆమె అన్నారు.

# విధుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే కఠిన చర్యలు

**-డ్యూటీకి హాజరు కాని సిబ్బందికి షోకాజ్ నోటీసులు జారీ**
**-మధిర ప్రభుత్వ ప్రాంతీయ ఆసుపత్రిని తనిఖీ చేసిన కలెక్టర్**





**ప్రజాపక్షం/ మధిర :** విధుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించే సిబ్బందిపై కఠిన చర్యలు తప్పవని జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి తెలిపారు. ఆదివారం మధిర ప్రభుత్వ ప్రాంతీయ ఆసుపత్రిని జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆసుపత్రిలోని క్యాజువాలిటీ, ఎల్‌డిఆర్ఎం రూము, డయాలసిస్ సెంటర్, లేబర్ రూము, ఎమర్జెన్సీ వార్డ్, రేడియాలజీ బ్లాక్, ఓపి రూము లను పరిశీలిస్తూ రోగులతో మాట్లాడి ఆసుపత్రిలో అందుతున్న సేవల వివరాలను అడిగి తెలుసుకున్నారు. రోగులకు అందుతున్న వైద్య సేవలు, సిబ్బంది పనితీరు, రోజు వారి కేసుల వివరాలు, ముఖ్యమైన రిజిస్టర్లు, నెలవారి నివేదికలను, ఔషధాల లభ్యత, పరిసరాల పరిశుభ్రతపై ప్రత్యేక దృష్టిసారించి, సేవలు మరింత నాణ్యంగా అందేలా వైద్య అధికారులు తగు చర్యలు చేపట్టాలని కలెక్టర్ ఆదేశించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ డ్యూటీలో లేని వైద్యులు, ఇతర సిబ్బందికి షోకాజ్ నోటీసులు జారీ చేయాలని ఆదేశించారు. ఆసుపత్రి వైద్యులు హాజరు సంబంధించి రెగ్యులర్‌గా రిపోర్ట్ తనకు అందించాలని కలెక్టర్ సూచించారు. ఆసుపత్రికి రెగ్యులర్‌గా వస్తున్న ఓపి వివరాలను కలెక్టర్ పరిశీలించారు. వైద్యులు, సిబ్బంది సకాలంలో అందుబాటులో ఉంటూ ప్రజలకు మెరుగైన వైద్య చికిత్స అందిస్తే ఎక్కువ మంది రోగులు ప్రభుత్వ ఆసుపత్రికి వస్తారని కలెక్టర్ తెలిపారు. ఆసుపత్రిలో సాధారణ ప్రసవాలను ప్రోత్సహించాలని, అనవసరపు సి సెక్షన్ ఆపరేషన్ చేయవద్దన్నారు. ఎమర్జెన్సీ వార్డులో కేసు షీట్‌లను పరిశీలిస్తూ రోగులకు అందుతున్న వైద్య సేవలపై ఆరా తీశారు. ఆసుపత్రిలో రోగులకు రెగ్యులర్‌గా అందుతున్న భోజనం నాణ్యత అంశాలను రోగులతో మాట్లాడి తెలుసుకున్నారు. ఈ పర్యటనలో కలెక్టర్ వెంట మధిర తహసీల్దార్ రాంబాబు, సంబంధిత అధికారులు, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# బిఆర్ఎస్ ఉద్యమకారుల సమావేశం




**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** బిఆర్ఎస్ పార్టీ ఉద్యమకారుల సమావేశం ఆదివారం జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా బిఆర్ఎస్ జిల్లా అధ్యక్షులు, ఎంఎల్‌సి తాతా మధుసూదన్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కో ఆర్డినేషన్ కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జిల్లా ఉద్యమకారుల కో ఆర్డినేషన్ కమిటీ గౌరవ అధ్యక్షులుగా డోకుపర్తి సుబ్బారావు, జిల్లా కన్వీనర్‌గా బొమ్మెర రామ్మూర్తి, కో కన్వీనర్‌గా పగడాల నరేందర్, సమన్వయ కర్తగా లింగనబోయిన సతీష్ లతో పాటు 22 మందితో కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సమావేశంలో పలు అంశాలపై తీర్మానాలు చేశారు. కేసులు, జైళ్లతో సంబంధం లేకుండా ఉద్యమకారులకు ప్రభుత్వం ఇచ్చే 250 గజాల స్థలం, ఇండ్లు కట్టుకోవడానికి రూ. 10 లక్షలు, అమరవీరులకు ఇచ్చే రూ.25వేల పెన్షన్‌ను విడుదల చేయాలని తీర్మానం చేశారు. ఉద్యమకారులకు ఇచ్చిన హామీలను వెంటనే అసెంబ్లీలో చర్చించి చట్టబద్దత తీసుకురావాలని కోరుతూ సోమవారం జిల్లా కలెక్టర్‌కు వినతి పత్రం అందజేయాలని తీర్మానించారు. ఈ సందర్భంగా తాతా మధుసూదన్ మాట్లాడుతూ ఉద్యమకారులకు పార్టీ అండగా ఉంటుందని తెలిపారు. ప్రభుత్వంపై ఉద్యమకారులు బలమైన పోరాటాలు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో బిచ్చాల తిరుమలరావు, నెల్లూరి అచ్యుతరావు, మందడపు శంకర్‌రావు, రంజాన్, బాలకృష్ణ, బురాన్, ఆసిఫ్, కోడిరెక్క ఉమ, పోతురాజు రమాదేవి, నాగుల్‌మీరా, ధనమ్మ, కోటేష్, రవి, వీరబాబు, కళ్యాణ్‌చంద్, పుల్లయ్య, రాము, ఆయూబ్ పాషా, జగదీష్, చందు నాయక్, శంకర్, దేవదాసు తదితరులు పాల్గొన్నారు.

# ఎన్డి నాయకులను అరెస్టు చేయడం అన్యాయం



**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** భూదాన్ బాధితులకు న్యాయం చేయాలని కోరుతూ ప్రశాంతంగా బంద్ నిర్వహిస్తున్న సిపిఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ నాయకులను అరెస్టు చేయడం సిగ్గుచేటని సిపిఐ(ఎంఎల్) ఎన్డి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఆవునూరి మధు, జిల్లా కార్యదర్శి బండారు ఐలయ్యలు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వెలుగుమట్ల బాధితులకు న్యాయం చేయాలని, ఇండ్లు కూల్చిన చోటే ప్రతి ఒక్కరికి ఇండ్లు కట్టించి ఇవ్వాలని, నష్ట పరిహారం చెల్లించాలని, ఆదివారం ఖమ్మం నగర బంద్‌కు సిపిఐ (ఎంఎల్)ఎన్డి ఖమ్మం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో పిలుపునివ్వడం జరిగింది. అన్ని వర్గాలు స్వచ్ఛందంగా సహకరిస్తూ బంద్ పాటిస్తున్న సందర్భంలో బంద్‌ను విఫలం చేయడానికి పోలీసులు ఎన్డి నాయకులను, కార్యకర్తలను అక్రమంగా అరెస్టు చేయడం దుర్మార్గమన్నారు. ఎటువంటి హెచ్చరికలు లేకుండా భూదాన్ భూముల్లో ఇండ్లు కూలగొట్టారని రాష్ట్ర వ్యాప్తంగా నిరసనలు వ్యక్తమవ్వడంతో ప్రభుత్వం ఇండ్లు కూల్చిన చోటే ఇండ్ల స్థలాలు ప్రకటించిందన్నారు. కాని అర్హులైన నిర్వాసితులకు ఇండ్ల స్థలాలు ఇవ్వకుండా తమ అనుచరులకు ఇండ్ల స్థలాలు ఇచ్చారన్నారు. హైకోర్టు ప్రభుత్వ తీరును కూడా తప్పుబడుతూ స్టేటస్ కో ఇచ్చిందన్నారు. అర్హులైన వారందరికి ఇండ్లు నిర్మించి ఇవ్వాలని ప్రభుత్వానికి కోర్టు తెలిపిందని కాని రాష్ట్ర ప్రభుత్వం కాలయాపన చేస్తుందన్నారు. ప్రభుత్వం తక్షణమే ఇండ్లు మంజూరు చేసి నష్టపరిహారం చెల్లించాలని లేని యెడల ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు లక్ష్మి నారాయణ, వై. ప్రకాష్, కాశీం, రమేష్, మోహన్‌రావు, గిరి, సుదర్శన్, మస్తాన్, ఉమా శంకర్, జాన్‌రెడ్డి, గాంధీ, అజయ్ తదితరులు పాల్గొన్నారు.

# అన్నదాతకు న్యాయం జరిగేనా..?

**-వెంకటరమణ సీడ్స్‌పై చర్యలుంటాయా...?**
**-శ్రీరామ్ పౌండేషన్ సీడ్స్ ఆర్.ఎన్.ఆర్ 15048 నకిలీనా..?**
**-ప్రతి ఏటా విత్తనాల లోపంతో సత్తుపల్లి రైతన్నలకు కన్నీళ్ళేనా..?**
**-వ్యవసాయ శాఖ అధికారులు ఏం చేస్తున్నారు...?**
**-డీలర్లకు అధికారులు గులాం గిరి చేస్తున్నారా...?**
**-తప్పెవరిది.. డీలర్లదా, రైతన్నలదా లేక అధికారులదా...?**




**ప్రజాపక్షం/సత్తుపల్లిః** సత్తుపల్లి మండలంలో ఏడు గ్రామాలలోని సుమారు 100 మంది రైతులు, 500 ఎకరాలలో శ్రీరామ్ ఫౌండేషన్ సీడ్స్, ఆర్ ఎన్ ఆర్,15048 (తెలంగాణ సోనా) అనే రకం విత్తనాలతో మోస పోయినా అన్నదాతకు న్యాయం జరిగేనా...?. అన్నదాతకు మాయ మాటలతో విత్తనాలు సరఫరా చేసిన పట్టణంలోని పాతసెంటర్‌లో గల విత్తన డీలర్ కడవకొల్లు ప్రసాద్, వెంకటరమట సీడ్స్ షాప్ పై చర్యలుంటాయా అని రైతులు వ్యవసాయశాఖాధికారులను ప్రశ్నిస్తున్నారు. సుమారు 3 నెలల క్రితం వ్యయ ప్రయాసల కోర్చి విత్తువిత్తి సాగు ప్రారంభించారు. ఈ గడిచిన 3 నెలల నుండి రైతన్నలు పంట చేతికందే వరకు కాయాకష్టం చేశారు. చివరకి పంట ఈనే దశలో రైతన్నలకు దిమ్మ తిరిగి బొమ్మ కనిపించింది. ఆశగా ఎదురు చూస్తున్న రైతన్నలకు పొట్ట దశలోనే తాలు గింజలు దర్శనమివ్వటంతో ఖంగుతిన్నారు. ఈ పరిస్థితి ఈనాడు వచ్చింది కాదు సత్తుపల్లి రైతులను ప్రతి ఏడు వెంటాడుతున్న నకిలీ విత్తనాల ముప్పు. ప్రతి ఏటా ఆశలతో విత్తనాలు చల్లే రైతన్నకు ఈసారి కూడా నిరాశే మిగిలింది. నాణ్యతలేని లేదా నకిలీ విత్తనాల కారణంగా పంటలు దెబ్బతినడంతో రైతులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రత్యేకంగా వెంకటరమణ సీడ్స్, శ్రీరామ్ ఫౌండేషన్ సీడ్స్ కంపెనీలపై అనుమానాలు వెల్లువెత్తుతున్నాయి. ఆర్ఎన్ఆర్15048 రకం విత్తనాలు నకిలీవా..? అనే ప్రశ్న ఇప్పుడు రైతుల్లో తీవ్ర చర్చనీయాంశంగా మారింది. విత్తనాలు వేసిన తర్వాత మొలక వచ్చినా, పంట లక్షణాలు సరిగ్గా లేక దిగుబడి తీవ్రంగా పడిపోవడంతో రైతులు భారీ నష్టాలను చవిచూస్తున్నారు. ఇది ఒక్కసారిగా జరిగిన ఘటన కాదని రైతులు చెబుతున్నారు. ప్రతి ఏడాది ఇదే సమస్య పునరావృతమవుతుందని, విత్తనాల నాణ్యతపై సరైన పర్యవేక్షణ లేకపోవడమే కారణమని రైతులు ఆరోపిస్తున్నారు. ఇక వ్యవసాయ శాఖ అధికారులపై కూడా రైతులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. మార్కెట్‌లోకి వస్తున్న విత్తనాలపై ముందస్తు తనిఖీలు జరగడం లేదని, ఫిర్యాదులు చేసినా స్పందన ఆలస్యంగా ఉంటోందని అంటున్నారు. డీలర్ల పాత్ర కూడా ఇప్పుడు ప్రశ్నార్థకంగా మారింది. కొన్ని సందర్భాల్లో నాణ్యత లేని విత్తనాలు అధిక ధరలకు విక్రయిస్తున్నారని ఆరోపణలు వినిపిస్తున్నాయి. అయితే డీలర్లు కూడా పైస్థాయి ఒత్తిళ్లకు లోనవుతున్నారా అనే అనుమానం వ్యక్తమవుతోంది. ఈ మొత్తం వ్యవహారంలో అధికారులుడీలర్ల మధ్య అనుమానాస్పద సంబంధాలు ఉన్నాయా అనే ప్రశ్నలు కూడా వినిపిస్తున్నాయి. వ్యవస్థలో లోపాలు ఉన్నప్పటికీ, దాని భారం మాత్రం రైతులపైనే పడుతోంది.ఈ నేపథ్యంలో తప్పు ఎవరిది అనే ప్రశ్న తలెత్తుతోంది. సీడ్ కంపెనీలు, డీలర్లు, అధికారులు ఈ ముగ్గురిలో ఎవరి నిర్లక్ష్యం జరిగినా, చివరికి నష్టపోయేది రైతే అనేది జగమెరిగిన సత్యం. 100 మంది రైతులు 500 ఎకరాలలో పంట నష్టపోయారు. కాని ఇప్పటి వరకు ఏ ఒక్కరూ రైతుల పక్షాన నిలిచిన వారు లేరు. అన్నదాత అయ్యా నాకు అన్యాయం జరిగింది అని మొత్తుకుంటుంటే అధికారులు సరిగ్గా స్పందించటం లేదని, డీలర్ తప్పించుకు తిరుగుతున్నాడని రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం, సంబంధిత అధికారులు స్పందించి నకిలీ విత్తనాలపై కఠిన చర్యలు తీసుకోవాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు. నష్టపోయిన రైతులకు తక్షణ పరిహారం ఇవ్వాలని కోరుతున్నారు.

# శాలివాహన జయంతి ఉత్సవాలు

## కెఎస్‌పి రాష్ట్ర అధ్యక్షుడిగా గుమ్మడిదల వెంకటనారాయణ






**ప్రజాపక్షం/వైరాః** కుమ్మర శాలివాహన ప్రజాపతి(కెఎస్‌పి) ఆధ్వర్యంలోయుగ పురుషుడు శాలివాహన చక్రవర్తి జయంతి ఉత్సవాలు ఖమ్మం పట్టణం కొలిచలం బ్రహ్మయ్య నివాసంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా కెఎస్‌పి నూతన అధ్యక్షుడిగా గుమ్మడిదల వెంకటనారాయణ ప్రమాణస్వీకారం చేశారు. శాలివాహన చక్రవర్తికి పూలమాల వేసి శాలివాహన కుల బంధువులకు జయంతి శుభాకాంక్షలు తెలిపారు. ఉమ్మడి కమ్మం జిల్లావ్యాప్తంగా పలువురు కుల సేవాపరులను గుర్తించి వారికి శాలివాహన సేవా పురస్కారాలను ప్రధానం చేశారు. ఈ కార్యక్రమంలో కెఎస్‌పి అధ్యక్షులు మాట్లాడుతూ శాలివాహన చక్రవర్తి సాధించిన విజయాన్ని స్ఫూర్తిగా తీసుకొని అందరం కలిసికట్టుగా మన భవిష్యత్తుని నిర్మించుకోవాలని రాజకీయ విద్యా రంగాల్లో మంచిగా రాణించాలని అన్నారు. టిజెఎస్ రాష్ట్ర కార్యదర్శి మల్లెల రామనాధం మాట్లాడుతూ రాజకీయాల్లో కూడా శాలివాహ కుల బంధువులు కీలకపాత్ర పోసించాలని అన్నారు. పలువురు వక్తలు మాట్లాడుతూ శాలివాహన జయంతి ఉత్సవాలు నిర్వహించడం సేవాపరులకి పురస్కారాలు ఇవ్వడం వారి సేవని గుర్తించడం అని ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో మల్లెలుషారాణి, కొలిచలం గీత, గంగాధర వీరయ్య, దరిపల్లి వెంకటనారాయణ, దామోదర కుమారస్వామి, బాడిశ లింగమూర్తి, గుమ్మడిదల సుబ్బారావు, బొడ్డుపల్లి వేణు, వన్యనపురపు హరినాథ్‌బాబు, కుదురుపాక నరసయ్య, కొలిచలం సామి, విలాసాగరం వెంకటేశ్వర్లు, దరిపల్లి కిరణ్, విలాసాగరం వెంకటేశ్వర్లు, తిగుళ్ల వెంకటరమణలు పాల్గొన్నారు.

# ఉన్నాం రాజశేఖర్‌కు ఘనసన్మానం



**ప్రజాపక్షం/తిరుమలాయపాలెం :** తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీలో జిల్లా కమిటీలను ప్రకటించిన నేపథ్యంలో ఖమ్మం జిల్లా కమిటీ లో తిరుమలాయపాలెం మండలానికి చెందిన సీనియర్ కాంగ్రెస్ నాయకులు ఉన్నాం రాజశేఖర్ ని జిల్లా పార్టీ జనరల్ సెక్రెటరీగా నియమించడం పట్ల మండల కాంగ్రెస్ నాయకులు జింకల గూడెం గ్రామానికి చెందిన సయ్యద్ మదర్ (డీలర్) దమ్మాయిగూడెం గ్రామంలోని ఉన్నాం రాజశేఖర్ నివాసంలో కలిసి సాల్వ కప్పి ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సుదీర్ఘ చరిత్ర కలిగిన కాంగ్రెస్ పార్టీలో కష్టపడే వారికి సమచూచిత స్థానం కలుగుతుందని ప్రతి ఒక్కరు పార్టీ కోసం కష్టపడితే పదవులు పొందుతారని ఆయన అన్నారు. కాంగ్రెస్ పార్టీ కష్టకాలంలో ఉన్నప్పుడు పార్టీ కార్యకర్తలు కు అండగా ఉంటూ కష్టాల్లో ఉన్న పేద ప్రజలకు నిత్యవసర సరుకులు పంపిణీ చేసి ఎంతోమంది పేద ప్రజల హృదయాలను గెలుచుకున్న ఉన్నం రాజశేఖర్ కు జిల్లా కాంగ్రెస్ పార్టీలో సభ్యుడిగా చేసుకోవడమే కాకుండా జనరల్ సెక్రటరీగా ప్రకటించడం సంతోషదాయకమని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు షేక్ హుస్సేన్, భానుతు రాజేష్, షేక్ మదర్, షేక్ అజీమ్, షేక్ నాగులు మీద, షేక్ హుస్సేన్, సే చిన్న మదర్, షేక్ మస్తాన్, బానోతు రాజా తదితరులు పాల్గొన్నారు.

# అంబేద్కర్ కమ్యూనిటీ హాల్ పునర్ వైభవానికి కూనంనేని కృషి



## సిపిఐ జిల్లా కార్యదర్శి సాబీర్ పాషా

**ప్రజాపక్షం/కొత్తగూడెం:** అంబేద్కర్ కమ్యూనిటీ హాల్ పునర్ వైభవం కోసం కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు విశేషంగా కృషి చేస్తున్నారని సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్ కె సాబీర్ పాషా అన్నారు. పట్టణంలోని అంబేద్కర్ కమ్యూనిటీ హాల్ నూతన అధ్యక్షులు మందా హనుమంతు అధ్యక్షతన ఆదివారం నిర్వహించిన తొలి సమావేశానికి ఆయనతో పాటు కార్పొరేషన్ మేయర్ మూడ్ గణేష్‌తో కలిసి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగాసాబీర్ పాషా మాట్లాడుతూ అణగారిన వర్గాల ప్రయోజనాల కోసం, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీల సంక్షేమం కోసం సిపిఐ పార్టీ ఎల్లప్పుడూ కట్టుబడి ఉంటుందని స్పష్టం చేశారు. కమ్యూనిటీ హాల్ అభివృద్ధి పనుల నిమిత్తం ఎమ్మెల్యే కూనంనేని ఇప్పటికే రూ. 15 లక్షల నిధులను మంజూరు చేశారని, భవిష్యత్తులో మరిన్ని నిధులు కేటాయించి దీనిని ఆదర్శవంతంగా తీర్చిదిద్దుతామని భరోసా ఇచ్చారు. నియోజకవర్గ వ్యాప్తంగా ఉన్న బహుజన వర్గాల కాలనీల్లో మౌలిక సదుపాయాల కల్పనకు ప్రాధాన్యత ఇస్తున్నామని వివరించారు. సామాజిక చైతన్యం, పేదల అభ్యున్నతి కోసం ప్రతి ఒక్కరూ ఐక్యంగా పని చేయాలని ఆయన పిలుపునిచ్చారు. సమావేశంలో కమిటీ నాయకులు కూసపాటి శ్రీనివాస్, మద్దెల శివ కుమార్, సలిగంటి శ్రీనివాస్, కార్పొరేటర్ దాసరి శ్రీనివాస్, మాజీ కౌన్సిలర్లు ధర్మరాజు, కంచర్ల జమలయ్య, కమ్యూనిటీ హాల్ కమిటీ సభ్యులు మధుసూదన్, చిన్ని, పీక కృష్ణ, గుండా రమేష్, పాల్, భూపేష్, మహిళా సభ్యులు కనుకుంట్ల రాములమ్మ, కరీష రత్నకుమారి, మంద నిర్మల తదితరులు పాల్గొన్నారు.

# మొదలైన కార్పొరేట్, ప్రైవేటు పాఠశాలల అడ్మిషన్ల దందా..!



## - గ్రామాల చుట్టూ తిరుగుతున్న పీఆర్‌వోలు
## -విద్యాశాఖ జోక్యం కోరుతున్న తల్లిదండ్రులు

**ప్రజాపక్షం/బూర్గంపాడు :** విద్యా సంవత్సరం పూర్తికాకముందే బూర్గంపాడు మండలంలో అడ్మిషన్‌ల హంగామా మొదలైంది. మండలంలోని పలు ప్రైవేట్ పాఠశాలలతో పాటు కార్పొరేట విద్యాసంస్థలు కూడా అడ్మిషన్‌ల కోసం తీవ్రంగా పోటీ పడుతున్నాయి. ముఖ్యంగా పాల్వంచ, కొత్తగూడెం, భద్రాచలం, ఖమ్మం ప్రాంతాలకు చెందిన కార్పొరేట్ పాఠశాలల ప్రతినిధులు గ్రామాలకు చేరుకుని విద్యార్థుల కోసం ప్రచారం చేయడం చర్చనీయాంశంగా మారింది. స్థానికంగా తమకు "పీఆర్‌వోలు"(పబ్లిక్ రిలేషన్ ఆఫీసర్లు)గా చెప్పుకునే కొందరు వ్యక్తులు గ్రామాల్లో ఇంటింటికి వెళ్లి తల్లిదండ్రులను సంప్రదిస్తూ అడ్మిషన్‌ల కోసం ప్రయత్నిస్తున్నట్లు సమాచారం. కొంత మంది కమిషన్ల కోసం అడ్మిషన్‌లను "కొనడం..అమ్మడం" జరుగుతోందని కూడా ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఒక్కో విద్యార్థిని కార్పొరేట్ పాఠశాలలో చేర్పిస్తే కమిషన్ ఇస్తామని చెప్పి కొంత మందిని ఆకర్షిస్తున్నట్లు స్థానికులు చెబుతున్నారు.

### ప్రైవేట్ టీచర్లపై అడ్మిషన్ టార్గెట్....

టీచర్లపై అడ్మిషన్ టార్గెట్లు మండలంలోని కొన్ని ప్రైవేట్ పాఠశాలలు తమ టీచర్లకు కూడా అడ్మిషన్ టార్గెట్లు విధిస్తున్నట్లు తెలుస్తోంది. పాఠశాలలు ఒక పూట మాత్రమే నడుస్తుండటంతో సాయంత్రం సమయంలో టీచర్లను గ్రామాలకు పంపించి అడ్మిషన్‌లు తెచ్చేలా ఒత్తిడి తెస్తున్నారని సమాచారం. ఇన్ని అడ్మిషన్‌లు తీసుకొస్తే జీతం పెంపు అంటూ ఆశలు చూపుతూ టీచర్లను గ్రామాల్లో తిరగమని యాజమాన్యాలు ఆదేశిస్తున్నాయని పలువురు చెబుతున్నారు. ఎండల్లో గ్రామాల చుట్టూ తిరుగుతున్న టీచర్లు ఇప్పటికే ఎండలు తీవ్రంగా ఉన్న నేపథ్యంలో కొంత మంది ప్రైవేట్ టీచర్లు అడ్మిషన్‌ల కోసం గ్రామాల్లో ఇంటింటికి తిరుగుతున్నారు. తమ ఉపాధి కోసం తప్పని సరి పరిస్థితుల్లో ఇలా చేయాల్సి వస్తోందని వారు చెబుతున్నారు. ఈ క్రమంలో వడదెబ్బ తగిలి అస్వస్థతకు గురైన సంఘటనలు కూడా చోటు చేసుకున్నాయని సమాచారం.

### ఇతర పాఠశాలలపై చెడు ప్రచారం....

తమ పాఠశాలలో అడ్మిషన్ చేర్పించుట కొరకు తల్లిదండ్రులకు తమ పాఠశాలలోని సదుపాయాలను తాము బోధించే విధానంను చెప్పాల్సిన కొంత మంది ప్రైవేట్ టీచర్లు ఇతర పాఠశాలలపై చెడు ప్రచారం కొంత మంది అడ్మిషన్‌ల కోసం మరో అడుగు ముందుకు వేసి తల్లిదండ్రులను ప్రభావితం చేస్తున్నారని ఆరోపణలు వినిపిస్తున్నాయి. తమ పాఠశాలల్లోని అన్ని సదుపాయాలు ఉన్నాయని చెప్పి తల్లిదండ్రులను నమ్మబలికి అడ్మిషన్‌లు చేయిస్తున్నట్లు స్థానికులు అంటున్నారు. ఫీజులు, డొనేషన్ల భారం ఇక కొన్ని ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలలు అడ్మిషన్ ఫీజులు, డొనేషన్లు పేరుతో అధిక మొత్తంలో డబ్బులు వసూలు చేస్తున్నట్లు తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇది మధ్యతరగతి, పేద కుటుంబాలకు భారంగా మారిందని చెబుతున్నారు.

### విద్యాశాఖ జోక్యం అవసరం....

ఈ పరిస్థితుల నేపథ్యంలో బూర్గంపాడు మండలంలో జరుగుతున్న అడ్మిషన్ ప్రచారంపై విద్యాశాఖ ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని తల్లిదండ్రులు, విద్యావేత్తలు కోరుతున్నారు. కార్పొరేట్ పాఠశాలల పేరుతో కమిషన్ల కోసం జరుగుతున్న ఈ వ్యవహారంపై విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.

### ఇంటింటికి వెళ్లి అడ్మిషను చేయడం నిబంధనలకు విరుద్ధం : ఎంఈఓ యెదు సింహారాజు

ఈ విషయంపై మండల విద్యాశాఖ అధికారి(ఎంఈఓ)యెదు సింహారాజును ప్రజాపక్షం వివరణ కోరగా ఆయన స్పందిస్తూ అడ్మిషన్‌ల కోసం ఇంటింటికి వెళ్లి మార్కెటింగ్ చేయడం, తల్లిదండ్రులపై ఒత్తిడి తీసుకురావడం నిబంధనలకు విరుద్ధమని తెలిపారు. ఇలాంటి ఫిర్యాదులు వస్తే సంబంధిత పాఠశాలలపై విచారణ జరిపి తగిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. ఇలాంటి పరిస్థితుల్లో విద్యా రంగంలో నైతిక విలువలు కాపాడుతూ ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలలు నిబంధనలు పాటించాలని, లేదంటే కఠిన చర్యలు తప్పవని తల్లిదండ్రులు అభిప్రాయపడుతున్నారు.

# అధికారుల ఆదేశాలు బేఖాతర్

## - యథేచ్ఛగా సెల్లార్ నిర్మాణం

**ప్రజాపక్షం/పాల్వంచ :** పాల్వంచ పట్టణంలో మున్సిపల్ అధికారుల ఆదేశాలు అమలునోచుకోవటం లేదని తెలుస్తోంది. సెల్లార్ నిర్మాణ పనులు నిలిపివేసి మట్టితో నింపాలని అధికారుల ఆదేశాలను బేఖాతర్ చేస్తూ యదేశ్చగా అక్రమ నిర్మాణాలు కొనసాగిస్తున్నారు. పట్టణ నటరాజ్ సెంటర్‌లో బడా బియ్యం వ్యాపారి కిన్నెరసాని రోడ్‌లో భవన నిర్మాణానికి అధికారుల నుండి అనుమతులు తీసుకొన్నారు. ప్రభుత్వానికి చెల్లించాల్సిన పన్నులకు ఎగనామం పెడుతూ గోరంత అనుమతులతో కొండంత నిర్మాణాల మాదిరిగా గుట్టుచప్పుడు కాకుండా సెల్లార్ నిర్మాణాన్ని చేపట్టాడు. దీనిపై వచ్చిన ఫిర్యాదుల మేరకు సంభంధిత అధికారులు భవన నిర్మాణ పనులను పరిశీలించారు. అనుమతులు లేకుండా చేపట్టిన పనులు నిలిపివేసి సెల్లార్ స్థలాన్ని మట్టితో నింపి మూసి వేయాలని ఆదేశించారు. ఇంతవరకు బాగానే ఉన్నా అనంతరం జరిగిన పరిణామాలతో చుట్టూ ఇటుకలతో తాత్కాలికంగా మూసివేసినట్లుగా నటించిన సదరు భవన యాజమాని అధికారులను, ప్రజలను మభ్యపెట్టారు. భవన నిర్మాణం పూర్తి అయిన తరువాత మూసి వేసిన సెల్లార్ కు అనుకొని ఉన్న గల్లి రోడ్‌కు ఎవరికి అనుమానం రాకుండా ఇటుకలు తొలగించి యధాతథంగా అధికారుల ఆదేశాలను తుంగలో తొక్కుతూ నిర్మాణం పూర్తి చేశారు. ఇంత జరుగుతున్నా సంభంధిత అధికారులు పట్టించుకోకపోవటం విస్మయానికి గురిచేస్తున్నది. వ్యాపారికి మునిసిపల్ చట్టాలు వర్తించవా అంటు పలువురు విమర్శిస్తున్నారు. నిత్యం కళ్ళెదుటనే జరుగుతున్న పనుల పట్ల ఉదాసీనత వహిస్తున్న అధికారుల తీరుపై పలు విమర్శలు వ్యక్తమవుతున్నాయి. పెద్ద ఎత్తున మాముళ్ళు పుచ్చుకొని వదిలేశారనే పట్టణ వ్యాప్తంగా ఆరోపణలు గుప్పుమంటున్నాయి. అధికారుల తీరుతో పేదోళ్ళకు మాత్రమే చట్టాలు, పెద్దోళ్ళకు వర్తించవంటూ పలువురు అంటున్నారు. ఇకనైనా అధికారులు స్పంధించి అక్రమంగా, అనుమతులు లేకుండా చేపట్టిన భవన సెల్లార్ నిర్మాణంపై తగు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.



**టిపిఓ వివరణ :** ఈ విషయంపై టిపిఓ నవీన్‌కుమార్ వివరణ కోరగా ఆదివారం సెలవు కావటంతో సోమవారం హౌజింగ్ ఇన్స్‌పెక్టర్‌ను పంపించి విచారణ చేయిస్తామని చెప్పారు.

# బడ్జెట్ ప్రజలను నిరాశ పరిచింది

## -ఎంఎల్‌సి తాతా మధుసూదన్



**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** తెలంగాణ ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ ప్రజలను తీవ్ర నిరాశ పరిచిందని బిఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షులు, ఎంఎల్‌సి తాతా మధుసూదన్ తెలిపారు. ఆదివారం బిఆర్‌ఎస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో తాతా మధుసూదన్ మాట్లాడుతూ కేవలం అంకెల గారడీతో ప్రజలను మోసం చేసే ప్రయత్నం తప్ప మరొకటి కాదన్నారు. ఎస్సి, ఎస్టి, బిసి సంక్షేమానికి సంబంధించి గత బడ్జెట్ కంటే ఈ ఏడాది నిధుల కేటాయింపుల్లో కోతలు విధించారన్నారు. రైతు భరోసా క్రింద రూ. 15వేలు ఇస్తామని హామీ ఇచ్చినా బడ్జెట్‌లో పాత లెక్కలనే చూపించారన్నారు. మహలక్ష్మి పథకం వల్ల ఉపాధి కోల్పోయిన ఆటో కార్మికులకు ఇవ్వాల్సిన రూ. 12వేల భృతి ఊసే లేదన్నారు. నిరుద్యోగ భృతి పేరే లేదన్నారు. గురుకులాల దుస్థితి, విద్యార్థుల మరణాలపై ప్రభుత్వం సమాధానం చెప్పలేక పోతుందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన రెండున్నర ఏళ్లలో రూ.3.75 లక్షల కోట్ల అప్పులు తెచ్చి ప్రజలకు ప్రయోజనం లేకుండా ఖర్చు చేసిందన్నారు. సీతారామ ప్రాజెక్టు 90 శాతం పనులు పూర్తయినా మిగిలిన పనులకు నిధులు కేటాయించకపోవడం రైతాంగాన్ని నిరాశలోకి నెట్టిందన్నారు. జిల్లాలో ముగ్గురు మంత్రులు ఉన్నప్పటికీ సీతారామ ప్రాజెక్టుకు, ఎర్త్ సైన్స్ యూనివర్సిటీకి నిధులు సాధించలేదన్నారు. సింగరేణి ఫండ్స్ డైవర్షన్, భూముల తాకట్టుపై ప్రభుత్వం వెంటనే శ్వేత పత్రం విడుదల చేయాలన్నారు. ఎస్సి, ఎస్టి, బిసి ఉప ప్రణాళికలను పునరుద్దరించి నిధులు తక్షణం విడుదల చేయాలన్నారు. రాష్ట్రాభివృద్ధికి ప్రత్యామ్నాయ ఆర్థిక విధానం రూపొందించాలని తాతా మధుసూదన్ డిమాండ్ చేశారు. ఇది ప్రజా వ్యతిరేక బడ్జెట్ అన్నారు. ఈ సమావేశంలో పగడాల నాగరాజు, వేణుగోపాల్, ఉన్నం బ్రహ్మయ్య, వీరయ్య, బొమ్మెర రామ్మూర్తి, తిరుమలరావు, తాజుద్దీన్, మల్లయ్య, శేషగిరిరావు, మురళీకృష్ణ, రఫీ, బురాన్ తదితరులు పాల్గొన్నారు.

# వ్యవసాయ కూలీలకు రోజుకు 600 వేతనం ఇవ్వాలి



**ప్రజాపక్షం/జూలూరుపాడు:** తెలంగాణ రాష్ట్రంలో అధికారం చేపట్టిన (కాంగ్రెస్) ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీ ప్రకారం వ్యవసాయ కూలీలకు ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకం ద్వారా ఏడాదికి 12,000 రూపాయలు ఇస్తానని హామీ ఇచ్చారు. కానీ హామీ ఇంతవరకు అమలు కాలేదు. రాష్ట్రంలో భూమిలేని వ్యవసాయ కూలీలను 5,19,191 మందిని మాత్రమే ప్రభుత్వం గుర్తించింది. వీరందరికీ 31 కోట్లు ఖర్చవుతుందని కానీ ఇచ్చింది. 83,887 కూలీలకు 53 కోట్ల రూపాయలు మాత్రమే చెల్లించిందని అఖిలభారత ప్రగశీల వ్యవసాయ కార్మిక సంఘం (ఏఐపీకేఎంఎస్) భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రధాన కార్యదర్శి జాటోత్ కృష్ణ అన్నారు. 2026 మార్చి 24,25 తేదీలలో కామారెడ్డి లో జరుగు ఏఐపీకే ఎంఎస్ తెలంగాణ ప్రథమ రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయాలని కోరుతూ జూలూరుపాడు మండలంలో ఎం రాజశేఖర్ అధ్యక్షతన ఉపాధి హామీ కూలీల మీటింగ్ జరిగింది. అనంతరం సంఘం రాష్ట్ర మహాసభల పోస్టర్ ఆవిష్కరణ జరిగింది. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి జాటోతు కృష్ణ పాల్గొని మాట్లాడుతూ రాష్ట్రంలో ఒక్క ఎకరా లోపు భూమి ఉన్నవారు 24.22 లక్షల మంది, రెండు ఎకరాల వరకు ఉన్న 17.02 లక్షల మంది నిరుపేదలు ఉన్నారని మీరందరికి తమ భూమిలో ఏడాదంతా పని దొరకడం లేదని వీరికి బ్రతకటానికి వేరే కూలి పనులపై ఆధారపడుతున్నారని కనీస బ్రతుకును కల్పించడం కోసం కేంద్ర ప్రభుత్వం బిజెపి, రాష్ట్ర కాంగ్రెస్ ప్రభుత్వాల బాధ్యత అని నేటి ధరల ప్రకారం ఒక కుటుంబం బ్రతకడానికి కనీసం నెలకు 26 వేల రూపాయలు కావాలన్నారు. రాష్ట్రంలోని వ్యవసాయ కూలీలను సమగ్రంగా గుర్తించి 12,000 వెంటనే చెల్లించాలి. వ్యవసాయ కూలీలకు ఎన్‌ఆర్‌ఈజీఎస్. ప్రస్తుతం విబిజి రాంజీ నిబంధనాలను వర్తింప చేయరాదు. వ్యవసాయ కూలీలు అందరికీ గుర్తింపు కార్డులు ఇవ్వాలి అని, ఎలాంటి కొలతలు లేకుండా ఫోటో సిస్టం లేకుండా రోజుకు 600 రూపాయలు వేతనం ఇవ్వాలని, 200 రోజుల పరిధిలో ప్రతి వ్యవసాయ కూలీకి కల్పించాలని జిల్లా కార్యదర్శి జాటోతు కృష్ణ డిమాండ్ చేశారు. ఈ నేపథ్యంలో 24, 25 తేదీలలో కామారెడ్డిలో జరిగే అఖిలభారత ప్రగశీల వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు ఎదులాపురం గోపాలరావు, బానోతు ధర్మ, ఎం రాజశేఖర్, బైరు వెంకన్న, జమలయ్య, మాణిక్యమ్మ, పాపక్క, కోటమ్మ, వీరన్న, వెంకటమ్మ, బొజ్జయ్య, దశరథ్ తదితర ఉపాధి మహిళలు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ ప్రభుత్వంలో రైతే రాజు

**ప్రజాపక్షం/తిరుమలాయపాలెం :** రైతు భరోసా నిధులను సకాలంలో విడు దల చేసి రైతులకు అండగా నిలవడం పట్ల కాంగ్రెస్ పార్టీ నాయకులు మాజీ మద్దులపల్లి మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ జూపెడ సర్పంచ్ వనవాసం నరేందర్ రెడ్డి హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇది రైతు కాంగ్రెస్ ప్రభుత్వంలో ప్రతి పేదవాడికి న్యాయం జరిగే విధంగా సంక్షేమ పథకాలు అమలు చేస్తున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి ఆయన ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. కష్టకాలంలో ఉన్న రైతులకు రైతు భరోసా నిధులను విడుదల చేసి రైతు పక్షపాతి రేవంత్ రెడ్డి అని నిరూపించుకున్నారని ఆయన అన్నారు. ఇటీవల రైతు భరోసా నిధులను విడుదల చేస్తున్నట్లు ప్రకటించిన తొమ్మిది రోజుల్లో తొమ్మిది వేల కోట్లు విడుదల చేసి రికార్డు సృష్టించిన ఘనత సీఎం రేవంత్ రెడ్డికి దక్కుతుందని తెలిపారు. ముఖ్యంగా రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధర కల్పించేందుకు ప్రభుత్వం ఎంతో కృషి చేస్తుందని ఇటీవల రైతులు విక్రయించిన వరి ధాన్యానికి 500 రూపాయలు బోనస్ కూడా విడుదల చేసిందని దేశవ్యాప్తంగా యూరియా కొరత ఏర్పడడంతో రైతులు ఇబ్బంది పడకుండా గ్రామాల వద్దకే యూరియా కట్టలను అందించి రైతులను ఆదుకుందని ఆయన వివరించారు. రైతులకు రైతు భరోసా నిధులను విడుదల చేసిన సీఎం రేవంత్ రెడ్డి కి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క కి, రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి కి, వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు కి రైతుల పక్షాన ధన్యవాదాలు తెలిపారు.